# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వచ్చే ఉగాది నాటికి మరో 5 లక్షల గృహప్రవేశాలు నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవిక హామీ మిషన్ గ్రామీణ్ బిల్లు-2025తో గ్రామాలలో ఉపాధి హామీ కల్పన పెరుగుతుందని ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ వెల్లడించారు.
- ❖ విశాఖపట్టణం వేదికగా ఫిబ్రవరి 13, 14 తేదీలలో ఏడీటీవోఐ నేషనల్ టూరిజం మార్ట్ జరగనుంది.
- ❖ సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే 16 ప్రత్యేక రైళ్ళను అదనంగా నడపనుంది.
- ❖ రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలు గుంటూరు వేదికగా రేపటి నుండి జరగనున్నాయి.

==========================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 5వ జిల్లా కలెక్టర్ల సదస్సు ఈరోజు ప్రారంభమయ్యింది. వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. సదస్సులో భాగంగా ఆయా శాఖలకు చెందిన పురోగతిపై ఉన్నతాధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వేగంగా స్పందించాలన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికీ గడువులోగా గృహ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇటీవల 3 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు చేసామని, వచ్చే ఉగాది నాటికి మరో 5 లక్షల గృహ ప్రవేశాలు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలకు ప్రజలు సంతృప్తి చెందాలని.. తద్వారానే ప్రజా విశ్వాసాన్ని పొందగలమని ముఖ్యమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 37 సెకన్లు)

==========================

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA) స్థానంలో ప్రభుత్వం నిన్న లోక్ సభలో ప్రవేశపెట్టిన “వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవిక హామీ మిషన్ గ్రామీణ్ (విబి జీ రామ్ జీ బిల్లు) గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కల్పనతో పాటు నాణ్యమైన ఆస్తుల సృష్టికి దోహదపడేలా రూపొందించబడిందని ఇరపై సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అదే విధంగా ఈ బిల్లు ద్వారా అక్రమ చెల్లింపులను నివారించవచ్చన్నారు. ఈరోజు ఆయన అమరావతిలో విబి జీ రామ్ జీ బిల్లుపై స్పందిస్తూ.. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాలపై తాము సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ సంస్కరణల ఆవశ్యకతను గుర్తించామన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రజలకు సంవత్సరానికి కల్పిస్తున్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకి పెంచడం కీలక సంస్కరణ అని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 : 40 వ్యయ నిష్పత్తిలో నిధులు సమకూర్చడం వల్ల ఈ పథకం కింద వినియోగించే నిధుల పరిమాణం పెరిగి గ్రామీణ ఉపాధి విస్తరణకు మరింత అవకాశం కలుగుతుందన్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు కార్మికుల లభ్యతపై ఏర్పడే వాస్తవ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ బిల్లులో ప్రభుత్వం మార్పులు చేపట్టిందని లంకా దినకర్ వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

=========================

అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా (ADTOI) సహకారంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖపట్టణం వేదికగా `ఏడీటీవోఐ నేషనల్ టూరిజం మార్ట్` నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఏడీటీవోఐ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం ఈరోజు కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశీయ పర్యాటక రంగంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంవోయూ కుదుర్చుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.

=========================

అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం, వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, జవాబుదారీతనం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ఇందులో భాగంగా “ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాజ్య విధానం- 2025” ను సమీక్షించి తగిన సూచనలు, సలహాలు అందించడానికి మంత్రుల బృందంతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మంత్రుల కమిటీలో తనతో పాటు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్, హోమ్ మంత్రి వంగలపూడి అనిత, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సభ్యులుగా ఉన్నామని తెలిపారు. న్యాయ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

=========================

సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని 16 అదనపు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సికింద్రాబాద్, వికారాబాద్ నుంచి శ్రీకాకుళం రోడ్ మధ్య జనవరి 9 నుండి 19వ తేదీ వరకు ఈ రైలు సర్వీసులు అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రోడ్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య 07288, 07289, 07290, 07291, 07294, 07295, 07292, 07293 నంబర్లతో ఈ రైళ్లు జనవరి 9 నుండి నడవనున్నాయని ఆయన వెల్లడించారు.

=========================

రాష్ట్ర యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రేపటి నుండి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు యువజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్. భరణి ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా

వడ్డేశ్వరంలోని కె.ఎల్. విశ్వవిద్యాలయం వేదికగా ఈ కార్యక్రమాలు జరుగనున్నాయని చెప్పారు. రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో భాగంగా జానపద నృత్యాలు, జానపద గీతాలు, శాస్త్రీయ నృత్యాలు, శాస్త్రీయ సంగీతం, నాటకాలు, చిత్రలేఖనం, కవిత్వం, కథా రచన, ప్రసంగం, క్విజ్, ఫోటోగ్రఫీ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో ఎంపికైన యువతీ యువకులు రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

==========================

కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖలోని ఆనందపురం జంక్షన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్థానిక పార్లమెంటు సభ్యులు మతుకుమల్లి శ్రీ భరత్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి శ్రీ భరత్ వినతి పత్రం అందించారు. పనుల ఆలస్యం కారణంగా ఆనందపురం జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య పెరుగుతోందని, అనకాపల్లి వైపు స్లిప్ రోడ్, విశాఖపట్నం వైపు వచ్చే మార్గంలో ఐలాండ్ మార్పులు వంటి ప్రతిపాదిత చర్యలు అమలులోకి వస్తే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గి, ప్రయాణీకుల భద్రత పెరుగుతుందని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వేగంగా పూర్తవుతున్న నేపథ్యంలో... విశాఖపట్నానికి అధిక సామర్థ్య రవాణా అనుసంధానం అత్యవసరమని శ్రీభరత్ వినతిపత్రంలో పేర్కొన్నారు.

==========================

ఐదు మ్యాచ్ ల టీ-20 సిరీస్ లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల నాల్గవ టీ-20 క్రికెట్ మ్యాచ్ లక్నో వేధికగా మరికాసేపట్లో ప్రారంభం కానుంది. బిఆర్ఎస్ఏబీవీ ఏక్నా స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతోంది. 2-1 తేడాతో ముందంజలో ఉన్న భారత్ ఈ మ్యాచ్ లో విజయం సాధించి సిరీస్ ను కైవసం చేసుకునేందుకు సిద్ధమవుతోంది.

==========================
==========================